రోడ్ల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత

- మంత్రి సీతక్క
- రోడ్ల మరమ్మతు పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర

వెంకటాపూర్, నవంబర్ 20 : రోడ్ల ఏర్పాటుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నదని, పంచాయతీరాజ్‌శాఖ ద్వారా చేపట్టనున్న నూతన రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్రపంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమశాఖల మంత్రి సీతక్క అన్నారు. బుధవారం మండలంలోని పలుగ్రామాల్లో చేపట్టిన రోడ్ల మరమ్మతు పనులకు మంత్రి సీతక్క, కలెక్టర్ టీఎస్ దివాకర, గ్రంథాలయ చైర్మన్ రవిచందర్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం లక్ష్మీదేవిపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా అంగన్‌వా డీ కేంద్రాల పూర్వ ప్రాథమిక విద్యా పరికరాలు, ఏకరూప దుస్తుల పంపిణీని ప్రారంభించి అంగన్‌వాడీ పిల్లలకు యూనిఫా మ్, 5రకాల ప్రీ స్కూల్ మెటీరియల్ పం పిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీత క్క మాట్లాడుతూ పంచాయతీ రాజ్‌శాఖ ద్వారా రాష్ట్రంలో రూ.12వేల కోట్లతో రో డ్ల నిర్మాణం చేపట్టడానికి నిర్ణయం తీసుకుని నిధులు సైతం కేటాయించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను జాతీయ రహదారులకు అనుసంధానం చేయడానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు రూ.500ల బోనస్ ప్రకటించడంతోపాటు ఇప్పటి వరకు 20లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసామని, రానున్న రోజుల్లో రైతు భరోసా అందిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్వ ప్రాథమిక విద్యా పరికరాలు, పిల్లలకు యూనిఫామ్, 5రకాల ఫ్రీ స్కూల్ మెటీరియల్ ఇచ్చామన్నారు. ప్రైవేట్ స్కూల్ దీటుగా ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధన ఉందని, పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని అన్నారు. ఈ సందర్భంగా అక్షరాభ్యాసం, అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమాల్లో జిల్లా శిశు సంక్షేమ అధికారి శిరీష, మండల అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తేమ శాతం 17 ఉంటే తక్షణమే కొనాలి

భూపాలపల్లి అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

భూపాలపల్లి రూరల్, నవంబర్ 20 : తేమ 17శాతం ఉంటే తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన ధాన్యం కొనుగోళ్లపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కల్లాల వద్దే ధాన్యం ఆరబెట్టి తేమ శాతం వచ్చిన తర్వాత కేంద్రాలకు తీసుకొచ్చేలా వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్లు, మాయిశ్చర్ మీటర్లు, టార్పాలిన్లు, గన్నీలు, డిజిటల్ గ్రీన్ క్యామ్‌బర్లు, కాంటాలు, హస్కీ రిమోవర్స్, ట్యాబ్‌లు ఉండాలని సూచించారు. అలాగే ప్రతి కొనుగోలు కేంద్రంలో ఏడు రకాల రిజిస్టర్లు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. సన్న, దొడ్డు రకం కేంద్రాలు వేర్వేరుగా ఉండాలని, కొనుగోలు చేసిన సన్న రకం ధాన్యానికి ఎస్ అనే అక్షరంతో ఎరు పు రంగు గుర్తు, దొడ్డు రకానికి ఆకుపచ్చ గుర్తు పెట్టాలని సూచించారు. నాణ్యత ఉన్నా ధాన్యం కొనుగోలులో ఏదేని జాప్యం జరిగి రైతులు ఇబ్బంది పడితే కేంద్రం ఇన్‌చార్జిలను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, పౌరసరఫరాల సంస్థ డీఎం రాములు, మార్కెటింగ్ అధికారి కనక శేఖర్, సహకార అధికారి వాల్య నాయక్, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, పీఏసీఎస్ సీఈవో పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మహాముత్తారం, నవంబర్ 20 : మహాముత్తారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో కోనంపేట, మీనాజీపేట, కిష్టాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి చైర్మన్ సోమ శాంతకుమార్ ప్రారంభించారు. ఏవో అనూష, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అనిల్‌రెడ్డి, సెంటర్ ఇన్‌చార్జిలు, రైతులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను ఆగంజేసిండ్లు

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్
- బీఆర్ఎస్‌లో చేరిన బీఎస్పీ మండలాధ్యక్షుడు

మహదేవపూర్ : పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

పలిమెల, నవంబర్ 26 : కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను ఆగంజేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రజావంచన దినాల్లో భాగంగా బుధవారం ఆయన మండలంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇప్పుడు కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఉన్న మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పథకాల అమలులో విఫలమయ్యారన్నారు. ఇచ్చిన హామీలు మరిచి విజయోత్సవాలు జరుపుతున్నందున అందుకు నిరసనగా కాంగ్రెస్ ప్రజావంచన దినోత్సవాలు జరుపుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం బీఎస్పీ మండలాధ్యక్షుడు కలుగూరి వెంకటయ్య మధూకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పలిమెల, మహదేవపూర్ మండలాల అధ్యక్షులు జవ్వాజి తిరుపతి, లింగంపల్లి శ్రీనివాస రావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గీత, యువజన నాయకుడు జక్కు రాకేశ్, నాయకులు లంగారి రవీందర్, తిరుపతి, సంతోష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి కుమార్తెకు పరామర్శ

మహదేవపూర్/ భూపాలపల్లి రూరల్ : మహదేవపూర్ మండలకేంద్రానికి చెందిన గోరకంటి కృష్ణారావు కుమార్తె ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు జక్కు రాకేశ్, స్థానిక నాయకులతో కలిసి పుట్ట మధు పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీతాబాయి, మండలాధ్యక్షురాలు ఓడేటి స్వప్నా మల్లారెడ్డి, సీనియర్ నాయకుడు పెండ్యాల మనోహర్, యూత్ అధ్యక్షుడు ఎండీ అలీం ఖాన్ పాల్గొన్నారు. భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీ సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో బుధవారం మేడ వెంకటస్వామి కుమార్తె సాయి ప్రసన్న –మహేశ్ వివాహానికి మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారివెంట కౌన్సిలర్ ముంజంపెల్లి మురళీధరర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లట్ట రాజాబాబు, భూక్యా శ్రీరాం ఉన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

ఏటూరునాగారం, నవంబర్ 20 : మండల కేంద్రంలోని కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరాటే అసోసియేషన్ కార్యదర్శి అబ్బు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్కూల్ గేమ్స్ కరాటే 68వ అండర్-17 బాలబాలికల పోటీలను ములుగులో ఈనెల 19న నిర్వహించారు. ములుగు, మహబూబాబాద్, జనగామ, వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల నుంచి పోటీల్లో పాల్గొన్నారు. ఏటూరునాగారానికి చెందిన విద్యార్థులు సీహెచ్ ఐశ్వర్య, కే శ్రీహరిణి, విజ్ఞాశ్రీ, విశాల్, జీ గణేశ్, జీ హర్షవర్ధన్, బీ అన్వేష్, బీ దినేష్, ఎల్ చరణ్, ఎండీ రూమేజ్ పాల్గొని తమ ప్రతిభను కనబర్చి బంగారు పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. వీరంతా రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

జోనల్ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

ములుగురూరల్, నవంబర్ 20 : జోనల్ స్థాయి క్రీడల్లో ములుగు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్మదబాయి తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు లక్ష్మిట్టిపేటలో జరిగిన పోటీల్లో ఎనిమిది స్వర్ణ పతకాలు, రెండు రజత పతకాలు, రెండు కాంస్యపతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్ షిప్ పొందారని అన్నారు. బుధవారం పాఠశాలలో వారిని అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, పీడీ త్రివేణి, పీఈటీ శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ములుగురూరల్, నవంబర్ 20 : మల్లంపల్లి గ్రామంలో ఉన్న ఏటూరునాగారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన జీ రాజేశ్ అనే విద్యార్థి అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి బాక్సింగ్‌కు ఎంపికైనట్లు పీడీ శ్రీధర్, పీఈటీ ప్రశాంత్ తెలిపారు. ఈ నెల 16న జరిగిన ఉమ్మడి జిల్లా పోటీల్లో రాజేశ్ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 23నుంచి 26వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో రాజేశ్ పాల్గొంటాడని వారు తెలిపారు. బుధవారం ప్రిన్సిపాల్ అంకయ్య విద్యార్థిని అభినందించారు.

బస్సు ట్రిప్పులను పెంచాలి : సీపీఎం

ములుగురూరల్, నవంబర్ 20 : ములుగులో ప్రయాణికుల సంఖ్య మేరకు ఆర్టీసీ అధికారులు బస్సు ట్రిప్పులను పెంచాలని, లేదంటే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి సద్దామ్‌హుస్సేన్ అన్నారు. బుధవారం ఆయన ములుగు బస్టాండ్‌ను సందర్శించి మాట్లాడారు. ములుగు జిల్లా కేంద్రంలో మోడల్ బస్టాండ్ మంజూరైనప్పటికీ ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నిర్మాణం చేపట్టకుండా కాలం వెల్లదీస్తున్నారని తెలిపారు. ప్రయాణికులకు సరిపడా బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అధికారులు స్పందించి ములుగులో బస్టాండ్ నిర్మాణం చేపట్టి ఏటూరునాగారంలో బస్సు డిపోను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట నాయకులు రత్నం ప్రవీణ్, జన్ను దేవేందర్, భరత్, రాజేశ్, రాకేశ్ ఉన్నారు.

దేశవ్యాప్తంగా సమగ్రకుల గణన చేపట్టాలి

కృష్ణకాలనీ, నవంబర్ 20: తెలంగాణలో చేస్తున్న సమగ్ర కులగణను దేశవ్యాప్తంగా చేపట్టాలని బీసీ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాదండి దేవేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ప్రముఖ న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్‌తో కలిసి మాట్లాడారు. డిసెంబర్ 9,10,11 తేదీల్లో బీసీ ఆజాది ఫొండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కుల గణనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని, వెంటనే దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణను చేపట్టి బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాధికారంలో వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ ఆజాది ఫొండేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్‌గౌడ్, భూపాలపల్లి, ములుగు జిల్లాల సీపీయూఎస్ఐ కార్యదర్శి వావిలాల లక్ష్మణ్, హెచ్ఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కర్నాటక సమ్మయ్య, బీసీ ఆజాది ఫొండేషన్ జిల్లా కార్యదర్శి నాగేందర్ పాల్గొన్నారు.

గణపురంలో మట్టి మాఫియా

గణపురం, నవంబర్ 20 : మండలంలో మట్టి మాఫియా రోజురోజుకూ పెట్రేగిపోతున్నదని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కండె రవి అన్నారు. బుధవారం మండలంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. పాత ఎమ్మార్వో ఆఫీస్ రోడ్డు మట్టిని కాంట్రాక్టర్ లోతుగా తీసి అక్రమంగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడని ఆరోపించారు. పాత ఎమ్మార్వో ఆఫీస్ రోడ్డును మరమ్మతు, కొత్త రోడ్డు నిర్మాణం పేరుతో ఎత్తుగా ఉన్న రోడ్డును సుమారు 5 మీటర్ల లోతుతో తవ్వారన్నారు. దీంతో చుట్టు పక్కల ఇండ్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వరద ముంపునకు గురయ్యే అవకాశాలున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను షేర్ వాల్ టెక్నాలజీతో నిర్మించిందని, నేటి పాలకులు వాటిని లబ్ధిదారులకు ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా మారాయన్నారు. గోదాం నిర్మాణంతో లారీలు ఇదే రోడ్డుపై వెళ్తుండడంతో గుంతలమయంగా మారిందని, అధికారులు రోడ్డు నిర్మాణంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కోగిల జితేందర్, మండల కన్వీనర్ కుర్రి స్వామినాథన్ పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను పరిశీలించిన సబ్ కలెక్టర్

మహదేవపూర్, నవంబర్ 20 : మండలంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను బుధవారం కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పులు లేకుండా వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో ప్రసాద్, కార్యదర్శులు రమేశ్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

పనితీరును మెరుగుపర్చుకోవాలి : డీఎంహెచ్‌వో

టీ డయాగ్నస్టిక్స్ వద్ద వైద్యులు, సిబ్బందితో డీఎంహెచ్‌వో

ములుగురూరల్, నవంబర్ 20 : ప్రభుత్వ దవాఖానల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించి తమ పనితీరును మెరుగుపర్చుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. బుధవారం ఆయన ప్రభుత్వ దవాఖానలోని టీ డయాగ్నస్టిక్ సెంటర్, రేడియాలజీ హబ్‌తోపాటు పలు వార్డులను సందర్శించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం జంగాలపల్లిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంతకుముందు మంత్రి సీతక్కను క్యాంపు కార్యాలయంలో కలిసి నూతనంగా విధుల్లో చేరినందుకు మంత్రికి పుష్పగుచ్ఛం అందించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని మంత్రి డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారులు రణధీర్, నమ్రత, వైశాలి, నవ్యరాణి, మాస్ మీడియా అధికారి సంపత్, సిబ్బంది దుర్గారావు, నవ్య, దీపిక, సురేశ్‌బాబు, నిర్మల, మేరీ, ఉమారాణి, వైద్య సిబ్బంది ఉన్నారు.

కల్తీ ఆహార పదార్థాలను అరికట్టాలని వినతి

వెంకటాపురం(నూగూరు), నవంబర్ 20 : ఏజెన్సీ ప్రాంతంలోని కిరాణాషాపుల్లో విక్రయాలు జరుగుతున్న కల్తీ ఆహార పదార్థాలను అరికట్టాలని కోరుతూ ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర నర్సింహమూర్తి బుధవారం ములుగు జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహమూర్తి మాట్లాడుతూ ఉప్పు, పప్పు, పాలు, పంచదార, నూనె వంటి నిత్యవసర వస్తువులతోపాటు రోగాల బారినపడి చనిపోయిన కోళ్లను, మేకలను కోసి వాటి మాంసాన్ని అధిక ధలరకు విక్రయిస్తున్నారని తెలిపారు. దీని ద్వారా ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని అన్నారు. ఫుడ్ సెఫ్టీ అధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. కల్తీకి పాల్పడుతున్న కిరాణాషాపులతోపాటు బేకరీలు, హోటళ్లను సీజ్ చేయాలని అన్నారు. అదేవిధంగా పోడు రైతులకు రుణాల మంజూరులో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. స్పందించిన ఆయన రుణాల విషయంతోపాటు కల్తీ నియంత్రణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నర్సింహమూర్తి వివరించారు.

బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ములుగురూరల్, నవంబర్ 20 : బాలలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ములుగు ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని ములుగు జిల్లాకేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో నిర్వహించగా ముఖ్యఅతిథులుగా ఎంపీడీవోతోపాటు డీడబ్ల్యూవో శిరీష హాజరయ్యారు. ఎంపీడీవో మాట్లాడుతూ బాలికలు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. డీడబ్ల్యూవో శిరీష మాట్లాడుతూ బాలబాలికలు వివక్షకు గురికాకుండా చదువులో రాణించాలన్నారు. అనంతరం జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో ప్రతిభకబర్చిన విద్యార్థులకు అతిథులు జ్ఞాపికలను అందజేశారు. డీసీపీయూ సోషల్ వర్కర్ బండారు జ్యోతి, ఓఆర్‌డబ్ల్యూ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధించవచ్చు

అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి

విజేతలకు బహుమతులు అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి

కృష్ణకాలనీ, నవంబర్ 20 : పట్టుదలతో శ్రమిస్తే జీవితంలో సాధించలేనిది ఏదీ లేదని అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు బుధవారం ఆమె హాజరై మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకునేందుకు గ్రంథాలయాల్లో గ్రంథ పఠనం చేసి, కావాల్సిన సమాచారం పొందాలన్నారు. పుస్తక పఠనంతోనే విజ్ఞానం వస్తుందన్నారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా వారం రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతితో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ గ్రంథపాలకుడు టీ చంద్రమౌళి, భూపాలపల్లి పాఠశాల హెచ్ఎం ప్రసన్నలక్ష్మి, కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ ఈశ్వరి, ఉపాధ్యాయులు నిఖిలేశ్వర్‌రెడ్డి, శేఖర్, క్రాంతికుమార్, గ్రంథాలయ సిబ్బంది పీ రవీందర్, బీ రాకేశ్, కే మంజుల పాల్గొన్నారు.

తప్పుల తడకగా సర్వే

చిట్యాల, నవంబర్ 20 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నహిస్తున్న కుల గణన సర్వే చల్లగరిగెలో తప్పుల తడకగా ఉందని, సర్వేను పారదర్శకంగా నిర్వహించి తమ సమస్యలపై విచారించాలని గ్రామానికి చెందిన పలువురు తహసీల్దార్ హేమ, ఎంపీడీవో జయశ్రీకి బుధవారం వినతిపత్రంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో బీసీ-ఎ కులానికి చెందిన బాలసంతలు, ఎస్సీ కులానికి చెందిన బేడ బుడిగ జంగాల కులస్థులమని వివరాలు చెప్తూ తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. అంతేకాకుండా సర్వేలో ఎస్సీ కులస్తులుగా నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. దీంతో సంక్షేమ పథకాల్లో నిజమైన ఎస్సీలకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. సర్వేలో కుల వివరాలు నమోదు చేసుకునే సమయంలో సర్టిఫికెట్లు పరిశీలించాలన్నారు. స్పందించిన తహసీల్దార్ త్వరలోనే గ్రామ సభ నిర్వహించి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జెర్రిపోతుల ఓదయ్య, దూడపాక సారయ్య, సిరిపెల్లి సారయ్య, కాంగ్రెస్ గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సోమిడి రఘుపతి, కొల్లూరి అశోక్, నోముల శివశంకర్, దూడపాక రాజు, శ్రీనివాస్, నరేశ్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

కృష్ణకాలనీ, నవంబర్ 20 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ ప్రధాన రహదారిపై విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్, జోసెఫ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యార్థుల ఉసురుతాకడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు జొన్నల శివ, పోతుల పవన్, సురేశ్, ప్రశాంత్, నవీన్, కార్తీక్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

టేకుమట్ల/ రేగొండ, నవంబర్ 20 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం టేకుమట్ల మండలకేంద్రంతో పాటు పంగిడిపల్లి, వెంక్రటావ్‌పల్లి, గర్మిళ్లపల్లి, రేగొండ, గోరికొత్తపల్లి మండలాల్లోని గోరికొత్తపల్లి, నిజాంపల్లె, వెంకటేశ్వర్లుపల్లె, సుల్తాన్‌పూర్, జగ్గయ్యపేట, రామగుండాలపల్లె, రేగొండ, రేపాక, రేపాకల్లె గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్, పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు వడ్లలో తాలు లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేసి, రూ.500 బోనస్ కలిపి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుందన్నారు. రైతులు ఇబ్బందులు పడినట్లు తెలిస్తే కేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. గోరికొత్తపల్లి మండలానికి సంబంధించిన కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీడీవో అనిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, కృష్ణారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు కిరణ్‌రావు, సంపత్, విజేందర్, మాజీ జడ్పీటీసీ తిరుపతిరెడ్డి, కత్తి సంపత్, గునిగంటి మహేందర్, కొయ్యల చిరంజీవి, రాజేందర్, నరేశ్, దాసరి కుమార స్వామి, రేగొండ పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్ఞన్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ గుంటోజు కిష్టయ్య, ఎంపీ డీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ శ్వేత పాల్గొన్నారు.

దేవాలయానికి రూ.48 లక్షలు

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మండలం గుడాడుపల్లి శ్రీరామాంజనేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణంలో భాగంగా ఎండోమెంట్ సర్వశ్రేయోనిధి నుంచి రూ.48 లక్షలు కేటాయించినట్లు ఎమ్మెల్యే జీఎస్ఆర్ తెలిపారు. బుధవారం సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ నవగ్రహ విగ్రహ యంత్ర ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై పూజలు చేశారు.

మరుగుదొడ్డి వినియోగం మన ఆత్మగౌరవం

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, నవంబర్ 20 : మరుగుదొడ్డి వినియోగం మన ఆత్మ గౌరవమని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. బుధవారం ఐడీవోసీ కార్యాలయంలో డీఆర్డీవో ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం సామాజిక బాధ్యతగా మరుగుదొడ్డి వినియోగించాలని సూచించారు. సంపూర్ణ స్వచ్ఛతకు నిరంతరం కృషి చేస్తున్న పారిశుధ్య కార్మికులను సన్మానించాలన్నారు. డిసెంబర్ 10 వరకు మరుగుదొడ్డి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛభారత్‌మిషన్ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై అవగాహన పెంచడమే కాకుండా, మరుగుదొడ్లు లేని ప్రదేశాలను గుర్తించనున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, డీఆర్డీవో అవినాశ్, డీపీఆర్వో శ్రీనివాస్, డీఈవో రాజేందర